క్లుప్తంగా

ఈతవనాల అభివృద్ధికి కృషి



ఈత మొక్కలు ఇస్తున్న ఎక్సైజ్ అధికారులు

మామడ: ఈతవనాల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని.. చెరువులు, కాలువ గట్లపై ఈత మొక్కలు నాటి సంరక్షించాలని ఎక్సైజ్ సీఐ రంగస్వామి పేర్కొన్నారు. గురువారం మండలంలోని న్యూలింగంపల్లి గ్రామంలో ఎక్సైజ్ అధికారులు.. గీత కార్మికులకు ఈత మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై అభిషేక్, సిబ్బంది, కల్లు గీత సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ విధులపై అవగాహన

లోకేశ్వరం: విద్యార్థులు పోలీసుల విధులపై అవగాహన పెంచుకోవాలని ఎస్సై అశోక్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన వేదం పాఠశాల విద్యార్థులకు ఎస్సై పోలీసుల విధులపై అవగాహన కల్పించారు. రికార్డుల నిర్వహణ, ఆయుధాల పనితీరు, ఎఫ్ఐఆర్ నమోదు తదితర అంశాలు వివరించారు. హెచ్‌ఎం రమేశ్, ఉపాధ్యాయుడు పోశెట్టి ఉన్నారు.

కాలనీలో వైద్యపరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

ఖానాపూర్: దీర్ఘకాలిక వ్యాధులైన టీబీ, హెచ్ఐవీపై గురువారం పట్టణంలోని డబుల్ బెడ్‌రూం కాలనీలో ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ రాంచందర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 46 మందికి పరీక్షలు నిర్వహించినట్లు రాంచందర్ తెలిపారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ అన్వర్, కాలనీవాసులు అఖిల్, అయాన్, అఫ్సర్, జమీర్ తదితరులు ఉన్నారు.

ఇళ్లు నాణ్యతతో నిర్మించాలి

లోకేశ్వరం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నాణ్యతగా చేపట్టాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. గురువారం మండలంలోని పిప్రి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ముగ్గు పోశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారుల ఖాతాల్లో విడతల వారీగా జమ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సోలామన్‌రాజ్ ఉన్నారు.

రాజురాలో వనమహోత్సవం

ఖానాపూర్: వన మహోత్సవంలో భాగంగా గురువారం మండలంలోని రాజురా గ్రామంలో మండల ప్రత్యేకాధికారి జీవరత్నం, ఎంపీడీవో సునీత తదితరులు మొక్కలు నాటారు. ఎంపీవో రత్నాకర్‌రావు, నాయకులు చిన్నం రవీందర్, అధికారులు, సిబ్బంది స్వామి, రమేశ్, రాణి, అశోక్ తదితరులు ఉన్నారు.

పాఠశాల తనిఖీ

ఖానాపూర్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో చదవాలని ఎంఈవో సంధ్యారాణి అన్నారు. గురువారం మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌ను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉన్నందున మధ్యాహ్న భోజన నిర్వహణ సక్రమంగా ఉండేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పాఠశాల సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేందర్ రావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎన్‌డీఆర్‌ఎఫ్ విన్యాసాలు



ప్రదర్శిస్తున్న బలగాలు

సారంగాపూర్: మండలంలోని జౌళి గ్రామంలో అధిక వర్షాలు, వరదలు, విపత్తుల సమయంలో ప్రజలను కాపాడే ఎన్‌డీఆర్‌ఎఫ్ బలగాలు గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా స్వర్ణ ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల్లో వరదల నేపథ్యంలో అప్రమత్తంగా ఎలా ఉండాలనే విషయాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో స్వర్ణ ప్రాజెక్టు డీఈ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌రావు, అగ్నిమాపక సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ప్రత్యేక ట్రాలీ ప్రారంభం

సారంగాపూర్: కేజ్‌వీల్స్‌తో కూడిన ట్రాక్టర్లను తిప్పి రోడ్లను ధ్వంసం చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. మండలంలోని జామ్ గ్రామంలో ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను తరలించేందుకు తయారు చేయించిన ప్రత్యేక ట్రాలీని గురువారం ఆయన ప్రారంభించారు. జామ్ గ్రామ ట్రాక్టర్ యూనియన్ మాదిరిగానే మిగతా గ్రామాల్లోనూ ప్రత్యేక ట్రాలీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించా రు. అనంతరం ఎస్సైని ట్రాక్టర్ యూనియన్ సభ్యులు సన్మానించారు. రమణ, సిబ్బంది, గ్రామస్తులు, ట్రాక్టర్ల యజమానులు ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

- జిల్లాలో సాగు విస్తీర్ణం పెంచాలి
- రైతువేదికల్లో అవగాహన కల్పించాలి
- కలెక్టర్ అభిలాష అభినవ్



ఉద్యాన దర్శిని పుస్తకం ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, పక్కన అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు వస్తాయని.. జిల్లాలో ఈ పంట సాగు విస్తీర్ణం పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఆయిల్‌పామ్ పంటల సాగుపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ పథకంలో భాగంగా జిల్లాకు 4500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. నీటి వసతి ఉన్న రైతులను గుర్తించి ఆయిల్‌పాం సాగు చేసేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ఆర్థిక ప్రోత్సాహకంతోపాటు సాంకేతిక సహకారం అందిస్తుందన్నారు. ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్ పాం సాగుకు తక్కువ పెట్టుబడులు అవసరమై అధిక లాభాలు ఉంటాయన్నారు. మండలాల వారీగా రైతువేదికలలో అన్నదాతలతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, ఆయిల్ పాం సాగు లాభాలను వివరించి రైతుల అనుమానాలు నివృత్తి చేయాలన్నారు.

ఉపాధి పథకం కింద గుంతలు తవ్వించాలి..

ఉపాధి హామీ పథకం కింద ఆయిల్ పామ్ మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వించాలన్నారు. వ్యవసాయశాఖ అధికారులు సహకారం అందించాలని పేర్కొన్నారు. అనంతరం అధికారులతో కలిసి కలెక్టర్ ఉద్యాన దర్శిని పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రమణ, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఇన్‌చార్జి ఆర్డీవో శ్రీనివాస్, వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు, ప్రియునిక్ కంపెనీ డీజీఎం, క్షేత్రస్థాయి ఉద్యోగులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో పోస్టులు భర్తీ చేయండి



చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రామారావు

తానూరు (ముథోల్): ముథోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్.. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ వి.బాలకృష్ణా రెడ్డిని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో చైర్మన్‌ను ముథోల్ వీడీసీ సభ్యులతో కలిసి వినతిపత్రం అందించారు. చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే వెంట వీడీసీ అధ్యక్షుడు పెద్దోల్ల విఠల్, మున్నూరు కాపు సంఘం తాలూకా అధ్య క్షుడు రోళ్ల రమేశ్, మాజీ సర్పంచ్ అనిల్, నాయకులు ధర్మపురి సుదర్శన్, తాటివార్ రమేశ్, సాంబ్లీ రమేష్, పండిత్ రావ్, మోహన్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

వేతనాలు ఇప్పించాలని వినతి

తానూరు (ముథోల్): తమకు పెండింగ్ వేతనాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ముథోల్ మండలంలోని ఉపాధిహామీ సిబ్బంది గురువారం ముథోల్ మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో ఏపీవో శిరీష, టీఏలు దేవదాస్ భా స్కర్, శ్రీలక్ష్మి యోగేష్, ఎఫ్ఏలు తదితరులున్నారు.

అంతర్గత రోడ్లు నిర్మించాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని 17వ వార్డు పరిధిలోని ఆస్రా కాలనీ, ఆస్రా కాలనీ న్యూ, రామ్‌నగర్‌లో మురుగుకాల్వలు, అంతర్గత రోడ్లు నిర్మించాలని కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ ఫిరోజ్ గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కాలనీ ఏర్పడి 45 ఏళ్లు గడుస్తుందని.. అధికారులు స్పందించి కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

విద్యార్థులు పొదుపు అలవాటు చేసుకోవాలి



సోన్‌లో మాట్లాడుతున్న అధికారి గోవింద్

సోన్: విద్యార్థులు చిన్నప్పటి నుంచే పొదుపు అలవాటు చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ సీఈవో గోవింద్ పేర్కొన్నారు. బాలశక్తి కార్యక్రమంలో భాగంగా సోన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మహిళా శక్తి మిషన్ వాలంటీర్లు మౌనిక, జ్యోతి ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాంకు వ్యవస్థ, లావాదేవీలు, బేటీ బచావో, బేటీ పఢావోపై అవగాహన కల్పించారు. ఎల్ డి ఎం రామ్మోహన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆరాధన, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

తానూరు: పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శ్రద్ధవహించాలని ఎంఈవో నరేందర్ సూచించారు. మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం బాలశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవ్ రావ్, సుదర్శన్, శిరీష్‌కుమార్, సుజాతదేవి, లక్ష్మి వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీల్లో సభ్యులుగా చేరాలి

కుంటాల: మహిళలు తప్పనిసరిగా స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ)లో సభ్యులుగా చేరాలని శ్రీనిధి జిల్లా ఆర్‌ఎం సరిత పేర్కొన్నారు. మండలంలోని కల్లూర్‌లో స్వయం సహాయక సంఘంలో సభ్యురాలైన పసుల గోదావరి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా.. బీమా పరిహారం కోసం గురువారం ఆర్‌ఎం గ్రామంలో విచారణ చేపట్టారు. సభ్యులకు రూ.పదిలక్షల బీమా సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. ఆమె వెంట ఏపీఎం అశోక్, శ్రీనిధి ఏపీఎం స్వాతి, సీసీ పెంటన్న, వీవోఏ అన్నపూర్ణ, వీవో అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక శ్రేయస్సే సీఐటీయూ లక్ష్యం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్

నిర్మల్‌చైన్‌గేట్: కార్మిక శ్రేయస్సే సీఐటీయూ లక్ష్యమని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో గురువారం ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఐటీయూ జిల్లా 2వ మహాసభలు అక్టోబర్ 26, 27తేదీల్లో నిర్మల్‌లో నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి పాలడు గు భాస్కర్, కోశాధికారి వంగురు రాములు హాజరవుతారన్నారు. 35 ఏళ్లుగా కార్మికులు, స్కీం వర్కర్ల సమస్యలు, హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలు నిర్వహించి విజయం సాధించామని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై భారం వేసి, పెట్టుబడిదారులకు మేలు చేస్తున్నాయని విమర్శించారు. ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ కార్మికులు వే తనాలు రెగ్యులర్‌గా చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని వివరించారు. జిల్లా మహాసభలకు కార్మికులు, మేధావులు, శ్రేయోభిలాషులు వచ్చి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు పి.గంగామణి, కోశాధి కారి బి.లలిత, జిల్లా కమిటీ సభ్యులు వి.శైలజ, జిల్లా నాయకులు బి.సుజాత తదితరులు ఉన్నారు.

కేంద్ర పథకాలతో అభివృద్ధి

కుంటాల: కేంద్ర ప్రభుత్వ పథకాలతో గ్రామాలను అభివృద్ధి చేయాలని ఎస్‌ఎల్‌ఎం టీం సభ్యులు నారాయణరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఓలా గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించారు. ఉపాధి పథకం, సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన, పీఎం ఆవాస్ యోజన, ఆయిల్‌పామ్ సాగు వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో అల్లాడి వనజ, ఏవో శ్రీనివాస్, ఎంపీవో ఎం.ఎ.రహీంఖాన్, ఏపీవో నవీన్, ఏపీఎం అశోక్, కార్యదర్శి యోగేష్, టీఏలు జై సింగ్ కార్తీక్ పాల్గొన్నారు.

స్వచ్ఛసర్వేక్షణ్ బృందం పర్యటన



పాఠశాలలో పరిశీలిస్తున్న బృంద సభ్యురాలు

దస్తురాబాద్: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2025లో భాగంగా ఉత్తమ గ్రామాలను ఎంపిక చేసేందుకు మండలంలోని మున్యాల్ గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృంద సభ్యురాలు ప్రియాంక గురువారం పర్యటించారు. గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్వహణ, ఇంకుగుడు గుంతలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. అనంతరం గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, ఎంపీవో రమేశ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రంజిత్, రామకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


గుండెపోటుతో ఎంఈవో మృతి



మధుసూదన్

సారంగాపూర్: సారంగాపూర్ ఎంఈఓ మధుసూదన్(55) గురువారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబీకుల వివరాల ప్రకారం తీవ్ర జ్వరంతో బాధపడుతున్న మధుసూదన్‌ను జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి గుండెపోటుతో మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఈయనకు భార్యతోపాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. మధుసూదన్ మృతిపై ఉపాధ్యాయ సంఘాల సభ్యులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పలువురు ఉపాధ్యాయులు ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు.

మా ఊరి సార్లను డిప్యుటేషన్‌పై పంపొద్దు



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులను అధికారులు మరోచోటకు డిప్యుటేషన్ పంపే ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు గురువారం కలెక్టరేట్‌కు వెళ్లి అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు వినతిపత్రం అందించారు. మా బడి సార్లు మాకు కావాలి.. వారిని మరోచోటకు పంపించొద్దని వేడుకున్నారు. ఇందులో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల లచ్చన్న, కమ్మల స్వామి, ఉపాధ్యాయుడు బాలాజీ తదితరులున్నారు.

'ఎమ్మెల్యే మాటలు సరికాదు'

భైంసాటౌన్: బాసర అమ్మవారి ఆలయం కోసం బిచ్చమెత్తుతానని ఎమ్మెల్యే రామారావు పటేల్ అనడం సరికాదని బీఆర్‌ఎస్ నాయకుడు విలాస్ గాదేవార్ అన్నారు. గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో మాట్లాడారు. బాసర అభివృద్ధికి గత ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయిస్తే రూ.8 కోట్లు ఖర్చు చేయగా.. మిగిలిన రూ.42కోట్లు వెనక్కి వెళ్లిపోయాయన్నారు. ఆ నిధులు వెనక్కి వెళ్లకుండా ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. అమ్మవారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పాఠశాలల్లో బోనాల వేడుకలు



కుంటాల: కల్లూరులో బోనాలతో విద్యార్థినులు

కుంటాల: ఆషాఢమాసం నేపథ్యంలో మండలంలోని కల్లూరు ప్రాథమిక పాఠశాలలో గురువారం బోనాల పండుగ నిర్వహించారు. విద్యార్థులు అమ్మవారి వేషధారణ, పోతరాజుల విన్యాసాలతో అలరించారు. సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు తెలిపేందుకే బోనాల పండుగ నిర్వహించినట్లు హెచ్‌ఎం చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుంటాలలోని విజయసాయి పాఠశాలలో బోనాల పండుగ నిర్వహించారు. విద్యార్థులు బోనాలతో గజ్జ ల మ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాలకు వెళ్లి నైవేద్యంగా సమర్పించారు. ప్రిన్సిపాల్ స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠం.. గుర్తుండేలా చిత్రం..!



భారతదేశ పటం వద్ద విద్యార్థినులు, సిబ్బంది

భైంసాటౌన్: విద్యార్థులు పుస్తకాల్లోని పాఠ్యాంశాలను గుర్తుంచుకునేలా విద్య అందిస్తున్నట్లు పట్టణంలోని కేజీబీవీ ఎస్‌ఓ జ్యోతి తెలిపారు. ఈ మేరకు పదో తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రంలోని భారతదేశం స్వ రూపం, భౌగోళిక అంశాలపై ప్రా జెక్టు వర్క్ ఇచ్చారు. దీంతో విద్యార్థినులు ఇలా పాఠశాల ఆవరణలో నేలపై భారతదేశం పటం వేసి, భౌగోళిక స్వరూపం, నదులు, పర్వతాలు, దిక్కులు సూచించేలా అందమైన చిత్రం గీశారు. అనంతరం వారితోనే తోటి విద్యార్థినులకు వివరించారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుల సర్దుబాటు షురూ

ఖానాపూర్: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ప్రారంభమైందని ఎంఈవో సంధ్యారాణి తెలిపారు. కడెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అనిత, మహేశ్‌ను మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇంగ్లిష్, మ్యాథ్స్ సబ్జెక్టులు బోధించేందుకు సర్దుబాటు చేసినట్లు తెలిపారు. కడెం మండలం లింగాపూర్ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు విశ్వనాథ్‌ను మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు, ఖానాపూర్ మండలం ఎర్వచింతల్ యూపీఎస్ ఫిజి కల్ సైన్స్ ఉపాధ్యాయుడు సురేశ్‌ను బీర్నంది జెడ్పీహెచ్‌ఎస్‌కు కేటాయించారన్నారు. కడెం ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు సుమతిని ఖానాపూర్ హనుమాన్ వాడ జెడ్పీహెచ్‌ఎస్‌కు, కడెం హైస్కూల్ ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు వెంకట్రాములును పాత ఎల్లాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు సర్దుబాటు చేశారన్నారు. పట్టణంలోని శాంతినగర్(ఒడ్డెవాడ) ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రాజశేఖర్‌ను ఖానాపూర్‌లోని డబుల్ బెడ్‌రూం కాలనీ ప్రాథమిక పాఠశాలకు, ఖానాపూర్ మండలం రాంరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు అరుణను పట్టణంలోని తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాలకు, పాతఎల్లాపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు శ్రీప్రియను బీర్నంది ప్రాథమిక పాఠశాలకు కేటాయించారని పేర్కొన్నారు. సర్దుబాటు ప్రక్రియ కొనసాగుతుందని.. మరిన్ని పోస్టులు కేటాయించాల్సి ఉందని వివరించారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలి



దుకాణాదారుడికి జరిమానా విధిస్తున్న సిబ్బంది

నిర్మల్‌టౌన్: నిబంధనలకు విరుద్ధంగా హోటళ్లు, కిరాణ దుకాణాల్లో ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానాలు విధిస్తామని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పలు దుకాణాలలో తనిఖీలు చేపట్టారు. అపరిశుభ్రత హోటళ్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్న దుకాణదారులకు రూ.4500 జరిమానాలు విధించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిషేధించకుంటే జరిమానాలు విధించి దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ ఉదయ్, మున్సిపల్ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నిర్మల్‌టౌన్: నిబంధనలు పాటించకుడా అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అంటించారు. వామపక్ష విద్యార్థి సంఘ నాయకులు సింగారి వెంకటేశ్ మాట్లాడుతూ జి ల్లాలో గుర్తింపు లేని పాఠశాలలను రద్దు చేయాలని కోరారు. కొన్ని పాఠశాలల పేర్లకు ఒలింపియాడ్, టెక్నో, గ్లామర్, ఇంటర్నేషనల్ అని పెడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘ నాయకులు శ్రీకాంత్, బాబుల్, సందీప్, నరేశ్, భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాల్సిందే

నిర్మల్‌టౌన్: పాఠశాలలకు విద్యార్థులను తీసుకెళ్లే ఆటోడ్రైవర్లు విధిగా నిబంధనలు పాటించాలని నిర్మల్‌రూరల్ ఎస్సై లింబాద్రి అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని మంజులాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్‌లో చిన్నారులను బడులకు తీసుకెళ్లే ఆటోడ్రైవర్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులను క్షేమంగా ఇంటి నుంచి పాఠశాలకు తీసుకెళ్లి.. తిరిగి ఇంటి వద్ద దింపాలని సూచించారు. డ్రంకెన్ డ్రైవింగ్ చేయరాదని హెచ్చరించారు. ఈవ్‌టీజింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

బడుల్లో గోరింటాకు సంబరాలు



దస్తురాబాద్ : సంబరాల్లో విద్యార్థినులు



ఖానాపూర్ : మెహందీ సంబరాల్లో చిన్నారులు

దస్తురాబాద్: మండలంలోని మున్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం గోరింటాకు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వామన్ రావ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: మండలంలోని బీర్నంది జెడ్పీహెచ్‌ఎస్, పట్టణంలోని సాయినగర్ కాలనీలో ఉన్న ఇషాన్ స్కూల్‌లో మెహందీ వేడుకలు నిర్వహించారు. అంతకుముందు ఇషాన్ పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. హెచ్‌ఎంలు జీఎల్‌వీ ప్రసాద్, వెంకటేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సమాచార హక్కు చట్టం పుస్తకాలు అందజేత

కుంటాల: సమాచార హక్కు చట్టం సామాన్యుడికి బ్రహ్మాస్త్రమని ఆ చట్టం జిల్లా పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు సీహెచ్.వినోద్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ సాదిక్ పేర్కొన్నారు. గురువారం కుంటాల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు సమాచార హక్కు చట్టం పుస్తకాలు అందజేశారు. ఈ పుస్తకం ప్రజలకు అందుబాటులో ఉంటే అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు రాహుఫ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

ఖానాపూర్: ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రతిష్ఠ దెబ్బతినేలా దుష్ప్రచారం చేస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ సీహెచ్ అజయ్, ఎస్సై రా హుల్ గైక్వాడ్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొనికేని దయానంద్, ఏఎంసీ వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్, చిన్నం సత్యం, కావలి సంతోశ్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ పట్టణ అధ్యక్షుడు షౌకత్‌పాషా, తోట సత్యం, జన్నారపు శంకర్, గంగ నర్సయ్య, నర్సయ్య, సంతోష్, శ్రీహరి ఉన్నారు.

కడెం: ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్ష పార్టీల నాయకులపై చర్యలు తీసుకోవాలని ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్ డిమాండ్ చేశారు. గురువారం కాంగ్రెస్ నాయకులతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, సతీశ్‌రెడ్డి, వాజీద్ ఖాన్, మధు, ఇస్రూ, బబ్లూ, ధర్మయ్య, రాజేశ్వర్ రెడ్డి ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలన

తానూరు (ముథోల్): ముథోల్ మండలం అష్ట గ్రామంలోని శ్రీ సరస్వతి లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం కాంగ్రెస్ నాయకులు రావుల శ్రీనివాస్, వీడీసీ చైర్మన్ సురుగుల పోశెట్టి పరిశీలించారు. కరెంట్ తీగలు కట్ చేసి కాపర్‌ను ఎత్తుకెళ్లడంతో ప్రభుత్వానికి రూ.15 లక్షల వరకు నష్టం జరిగిందని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి దుండగులను పట్టుకునేలా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులు బొంగు సాయిలు, కనకాపురం అనిల్, గంగాధర్, అంజి, శ్రీకాంత్, కనకాపురం లింగం, వీడీసీ సభ్యులు లక్ష్మారెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీహెచ్‌ఎస్‌లో సమస్యలు పరిష్కరించాలి

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని గురువారం ఇన్‌చార్జి హెచ్‌ఎం బోనగిరి నరేందర్‌రావు.. ఎంఈవో సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. 800 మంది విద్యార్థులున్న పాఠశాలలో 15 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. సరిపడా మూత్రశాలలు, గదులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని. నూతన భవనం అప్పగించలేదని వాపోయారు. పీజీహెచ్‌ఎం పోస్టు ఖాళీగా ఉందని వివరించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెన్నం అంజయ్య, తొంటి శంకర్ తదితరులున్నారు.